క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

రేణిగుంట : శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురానికి చెందిన పోలంరెడ్డి బత్తెమ్మ మృతి చెందడంతో శుక్రవారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు హేమభూషణ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరుగురికి జరిమానా

శ్రీకాళహస్తి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో శ్రీకాళహస్తి న్యాయస్థానం ఆరుగురికి జరిమానా విధించింది. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసుల కథనం.. శుక్రవారం రాత్రి పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా అందులో ఆరుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు తేలింది. వారిని శనివారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.రూ.60 వేలు జరిమానా విధించారు.

కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే


ప్రచారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సత్యవేడు : మండలంలోని దాసుకుప్పం పీహెచ్‌సీ పరిధిలో గ్రామ పంచాయతీల్లో కుష్ఠు వ్యాధి సర్వే ఇంటింటా చేపట్టాలని డాక్టర్ గుణశేఖర్ పేర్కొన్నారు. శనివారం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలకు ఆశా కార్యకర్తలకు సీహెచ్‌ఓ ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో అనుమానితులను పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు పంపి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి ఎస్.సుబ్రమణ్యం, నాగజ్యోతి, షణ్ముగం పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం రేణిగుంటలోని ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, క్లస్టర్ ఇన్‌చార్జి పుష్పనాథన్, తదితరులు పాల్గొన్నారు.


గోకులం షెడ్లు ప్రారంభం

వరదయ్యపాళెం : మండలంలోని కాంబాకం, ఇందిరానగర్, వడ్డిపాళెం గ్రామాల్లో పశువుల కోసం నిర్మించిన గోకులం షెడ్లను శనివారం స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, పశువైద్యాధికారి గౌరి, టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, నాయకులు నిర్మల్, జయచంద్ర నాయుడు, చలపతి నాయుడు పాల్గొన్నారు.

22న కలెక్టర్ సమీక్ష

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పరిపాలన భవనంలో ఈనెల 22న కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్ష నిర్వహిస్తారని ఈఓ బాపిరెడ్డి తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉదయం 11గంటలకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు.

ట్యాక్సీ డ్రైవర్ అనుమానాస్పద మృతి


లక్ష్మీప్రసాద్ (ఫైల్)

రేణిగుంట : రేణిగుంట మండలం కరకంబాడి చెరువులో ఓ వ్యక్తి మృతదేహాన్ని శనివారం రేణిగుంట పోలీసులు గుర్తించగా, అతను తిరుపతికి చెందిన ట్యాక్సీ డ్రైవర్‌గా నిర్ధారించారు. రేణిగుంట ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి కథనం మేరకు... తిరుపతి జీవకోన క్రాంతి నగర్‌కు చెందిన ట్యాక్సీ డ్రైవర్ లక్ష్మీప్రసాద్ (53) తిరుపతిలో రైల్వేస్టేషన్ వద్ద ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈనెల 16న ఇంటి నుంచి వచ్చిన లక్ష్మీప్రసాద్ తిరిగి ఇంటికి వెళ్లకపోవడం, సెల్‌ఫోన్ పని చేయకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు తిరుపతి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రేణిగుంట మండలం కరకంబాడి కట్టపుట్టాలమ్మ ఆలయం సమీపంలో చెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి రేణిగుంట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి సిబ్బందితో అక్కడకు చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. అయితే అలిపిరి పోలీసులకు ఈ విషయాన్ని తెలిపి, వారిద్వారా లక్ష్మీప్రసాద్ కుటుంబికులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని చూసి మృతి చెందిన వ్యక్తి లక్ష్మీప్రసాద్‌గా గుర్తించారు. మృతుడు లక్ష్మీ ప్రసాద్ కరకంబాడికి ఎందుకు వచ్చాడు? మద్యం మత్తులో చెరువులోకి జారిపడి మృతి చెందాడా? ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక హతమార్చి చెరువులో పడేశారా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

మిరప పంటల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ : గాజులపెళ్లూరు, కారణి గ్రామాల్లో సాగు చేసిన మిరప పంటను శనివారం మండల ఉద్యాన వనశాఖాధికారిణి యామిని పరిశీలించి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. తుపాన్ ప్రభావంతో మిర్చి పంటలో వివిధ రకాల తెగుళ్లు వ్యాపిస్తున్నాయన్నారు.


సర్వే చేపడుతున్న రీసర్వే సిబ్బంది

నాడు వద్దు.. నేడు ముద్దు


హద్దులను గుర్తిస్తున్న సిబ్బంది

- మళ్లీ భూసర్వే ప్రారంభించిన ప్రభుత్వం
- నాడు వద్దన్న పథకమే నేడు అమలు
- విస్మయం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

వరదయ్యపాళెం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వేపై సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు , జనసేన, బీజేపీ కూటమి నేతలతో పాటు ఎల్లో మీడియా చేసిన దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. ఈ సర్వేపై రైతులు, ప్రజల్లో అనేక సందేహాలు రేకెత్తించారు. అప్పట్లో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల బహిరంగ సభల్లో సమగ్ర భూసర్వేను ఉద్దేశించి.. తమ్ముళ్లు మీ భూములను జగన్ లాగేసుకుంటున్నాడు.. కూటమిని గెలిపిస్తే భూ సర్వేను రద్దు చేస్తాం..మీ భూములను కాపాడుతాం అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించారు. ఏ సర్వేను అయితే రద్దు చేస్తామని నాడు చెప్పారో అదే సర్వేను నేడు కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రారంభించడంపై ప్రజలు, రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వందేళ్ల తర్వాత సర్వే

రైతులు ఎన్నో ఏళ్లుగా భూసమస్యలను ఎదుర్కొంటున్నారు. భూమి ఒకరిది అయితే మరొకరి పేరున రికార్డులో నమోదు కావడం. సర్వే నెంబర్లలో తప్పులు, సరిహద్దుల సమస్య, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికావడం వంటి అనేక సమస్యలు ఉన్నాయి. భూసమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమగ్ర భూరీసర్వేకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో వందేళ్ల తర్వాత సమగ్ర భూసర్వేను వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రారంభించింది. ఇంతకు ముందు ఏ ప్రభుత్వమూ ఇంతటి మహోన్నతమైన కార్యక్రమం గురించి ఆలోచన చేయలేదు.


రీసర్వేకు సహకరించాలంటూ వరదయ్యపాళెం మండలంలో ర్యాలీ చేస్తున్న సర్వే బృందం

గత వైఎస్సార్‌సీపీ పాలనలో ..

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం పేరుతో రాష్ట్రంలో మొదటి విడత సమగ్ర భూసర్వేను గత ప్రభుత్వం ప్రారంభించింది. మూడు దశల్లో 2023 జనవరి నాటికి సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వందల సర్వే బృందాలతో అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్లతో సర్వే చేపట్టారు. సత్యవేడు నియోజకవర్గం పరిధిలోని 7 మండలాల్లో 170కి పైగా రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిలో మొదటి విడతగా కొన్ని గ్రామాల్లో గత ప్రభుత్వం భూసర్వే పూర్తి చేసింది. అయితే భూసర్వేపై ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు నుంచే టీడీపీ, జనసేన నాయకులు భూసర్వే అంటే రైతులు భయపడేంతలా విషప్రచారం చేశారు. ఇంత స్థాయిలో వ్యతిరేకించిన వారే ఇప్పుడు ఏపీ భూసర్వే పేరుతో సర్వేను మళ్లీ ప్రభుత్వం ప్రారంభించడం కొసమెరుపు.

సర్వే చేపడుతున్నాం



పైలట్ ప్రాజెక్టు కింద వరదయ్యపాళెం మండలంలోని యానాదివెట్టు రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేశాం. అక్కడ రీసర్వేను మొదలు పెట్టేందుకు మండల సర్వేయర్, ఇతర సర్వే బృందం ప్రక్రియను ప్రారంభించాం. మొదటగా పైలట్ ప్రాజెక్టు కింద చేపడుతున్న ఈ గ్రామం పూర్తయిన వెంటనే మిగిలిన రెవెన్యూ గ్రామాల్లోనూ భూ రీసర్వే చేయిస్తాం.

– రాజశేఖర్, తహసీల్దార్, వరదయ్యపాళెం మండలం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రీసర్వే జరిగిన గ్రామాలు

- **వరదయ్యపాళెం** – నెల్లటూరు, కోవూరుపాడు, అయ్యవారిపాళెం
- **నాగలాపురం** – కృష్ణాపురం, కాళంజేరి
- **పిచ్చాటూరు** – రాజానగరం, అప్పంబట్టు
- **బీఎన్‌కండ్రిగ** – కంచనపుత్తూరు
- **సత్యవేడు** – పేరడం, ఆంబాకం, మదనంజేరి, తొండుకొల్లి, సిరనంబూదూరు, మదనపాళెం, దలవాయి అగ్రహారం, చెంగంబాకం
- **నారాయణవనం** – పాలమంగళం నార్త్, పాలమంగళం సౌత్, తుంబూరు, నైనారుకండ్రిగ, అరణ్యకండ్రిగ, కీలగరం, కసింమిట్ట, భీమునిచెరువు, డీకేపాళెం, ఇప్పన్‌తాంగల్, నారాయణవనం, తిరువట్యం, వీకేపాళెం, ఎరికంబట్టు, కళ్యాణపురం, బొప్పరాజుపాళెం

కూటమి ప్రభుత్వంలో సర్వేచేసే గ్రామాలు..

- నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో 7 రెవెన్యూ గ్రామాల్లో ప్రస్తుత ప్రభుత్వం భూసర్వే ప్రక్రియను సర్వే సిబ్బంది ప్రారంభించారు.
- కేవీబీపురం – సుబ్రమణ్యపురం
- పిచ్చాటూరు – రామాపురం
- నాగలాపురం – వేలూరు
- నారాయణవనం – పాలమంగళం
- వరదయ్యపాళెం – యానాదివెట్టు
- సత్యవేడు – కాదిరివేడు
- బీఎన్‌కండ్రిగ –కేవీపురం

స్వచ్ఛ సాధనకు కలసిరావాలి


రేణిగుంట : ర్యాలీలో సర్పంచ్ నాగేషం, సిబ్బంది

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట పట్టణంలో శనివారం ఎంపీడీఓ విష్ణు చిరంజీవి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు పంచాయతీ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ నాగేషం, ఈఓపీఆర్డీ ప్రభురావు, ఇఓ మణి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

నాగలాపురం : మండలంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి రమేష్ చంద్ర తెలిపారు. సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ముళ్ల పొదలు , చెత్తా చెదారం తొలగించారు. గుంతలు ఉన్న చోట గ్రావెల్‌తో చదును చేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ప్రభుత్వ కార్యాలయ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర , స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలసి స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చెత్తా చెదారాన్ని తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛంధ్రాలో అధికారులు భాగస్వాములు కావాలన్నారు. ఈఓపీఆర్డీ రాజశేఖర్, ఏఓ భారతి, ఏపీఎం మునెయ్య, ఏపీఓ భానుప్రియ, కార్యదర్శి సుబ్రమణ్యం పాల్గొన్నారు.


ఎంపీడీఓ కార్యాలయం వద్ద చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న అధికారులు , సిబ్బంది

ఆహార భద్రతపై అవగాహన

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంటలోని శనివారం ఫుడ్ సేఫ్టీ ట్రెనింగ్ అండ్ సర్టిఫికేషన్ సెంటర్ ప్రతినిధులు పట్టణంలోని హోటల్ నిర్వాహకులకు ఆహార భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా ఆహార భద్రత అధికారులు జగదీష్, నర్మద, ఈఓపీఆర్డీ ప్రభురావు, సర్పంచ్ నగేషం హాజరయ్యారు. హోటల్ నిర్వాహకులకు ప్రాజెక్టర్ ద్వారా ఆహార భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓ జగదీష్ మాట్లాడుతూ.. హోటల్ నిర్వాహకులు ఆహార భద్రత నియమాలను పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఫాస్ట్ ట్రాక్ ద్వారా ట్రెనింగ్ తీసుకొని సర్టిఫికెట్ పొందాలని తెలిపారు. సర్టిఫికెట్ పొందటమే కాక భద్రత నియమాలను పాటించాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. ఆహారం విషయంలో రుచి, శుభ్రత, నాణ్యతలను విధిగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ ఆడిటర్ ట్రెనర్ మహ్మద్ జైద్, శ్యానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ నాగరాజు, స్టేట్ కోఆర్డినేటర్ దాస్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ వెంకటరామారావు, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ సునీల్, లోకేష్, శ్రీ విష్ణు, సంజీవి, నాగరాజు, సతీష్, హోటల్ నిర్వాహకులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ ప్రభురావు

ఆలయంలో ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో కంచుగడప వద్ద ఉన్న నందికి ఆదివారం కుంభాభిషేకం నిర్వహిస్తారు. అందులో భాగంగా శనివారం ఆలయంలో కలశ స్థాపన చేసి అంకురార్పణ పూజలను శాస్త్రోక్తంగా చేశారు. కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న వేదపండితులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం




సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, ర్యాలీలో ఈఓ బాపిరెడ్డి, ఆలయ సిబ్బంది

శ్రీకాళహస్తి : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కార్యాలయ పరిసరాలను ఉద్యోగులు, సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. అనంతరం వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం ఎంత పరిశుభ్రంగా ఉంటామో పరిసరాలు అంతే విధంగా ఉంచుకోవాలన్నారు. చెత్త వేసేందుకు కార్యాలయాల్లో చెత్త బుట్టలను వినియోగించుకోవాలని సూచించారు. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీమా.. కుటుంబానికి ధీమా

- కేంద్రం పలు బీమా పథకాలు అమలు
- బ్యాంకు ఖాతా ఉంటే చాలు
- తక్కువ ప్రీమియం
- పేదలకు ప్రయోజనం



బుచ్చినాయుడుకండ్రిగ : కేంద్ర ప్రభుత్వం పలు బీమా పథకాలను అమలు చేస్తోంది. వాటిలో ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా పథకాలు ఉన్నాయి. ఇవి యాక్సిడెంటల్, అన్ని రకాల మరణాలకు ఇన్సూరెన్స్ పాలసీలు. అంటే పాలసీదారుడు మరణిస్తే..వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కలిగిస్తాయి. కుటుంబం ఆర్థిక ఒడిదొడుకులతో ఇబ్బందులు పడకుండా ముందుకు వెళ్లడానికి ఈ పథకాలు దోహదపడుతాయి. పీఎం సురక్ష బీమా యోజనలో చేరాలనుకునే వారికి బ్యాంకు ఖాతా తప్పనిసరిగా ఉండాలి. ఖాతాదారులు నేరుగా బ్యాంకు అధికారులను కలసి ఈ పథకం వివరాలు తెలుసుకోవచ్చు. ఈ బీమా పథకంలో చేరాలనుకునే వారు ఆటో డెబిట్ ఫెసిలిటీ యాక్టివేట్ చేసుకోవాలి. ఇలా చేసుకుంటే ఖాతాదారుడి బ్యాంకు అకౌంట్ నుంచి ప్రతి సంవత్సరం మే నెల చివరిలో రూ. 20 నేరుగా కట్ అవుతాయి. అందువల్ల ఖాతాదారుడు ఆ నెలలో అకౌంట్‌లో మినిమం బ్యాలెన్స్‌తోపాటు రూ.20 కచ్చితంగా ఉండాలి.

పీఎంజీజేవై (ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన)

ఈ పథకాన్ని కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఈ పథకం రూ. 436 వార్షిక ప్రీమియంతో అన్ని రకాల మరణాలకు కవర్ చేస్తుంది. 18–50 ఏళ్ల మధ్య వారు ఈ బీమా పొందవచ్చు. ఈ బీమా పథకం కింద అన్ని బ్యాంకులు, తపాలా కార్యాలయాల నుంచి తీసుకోవచ్చు.

> **సద్వినియోగం చేసుకోవాలి**
>
> బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. పీఎంఎస్‌బీవై, పీఎంజీజేవై పథకాలపై గ్రామా ల్లో అవగాహన కల్పిస్తున్నాం. పేదలకు ఈ పథకం చాలా ఉపయోగం. ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుంది. అలాగే పూర్తి అంగవైకల్యం కలిగినా బీమా మొత్తం చెల్లిస్తారు. ఈ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.
>
> – వెంకటరమణ, సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజరు, బుచ్చినాయుడుకండ్రిగ

పీఎం సురక్ష బీమా ప్రయోజనాలు

- ప్రమాదవశాత్తు మరణం, వైకల్యానికి సంబంధించి బీమా అందించే పథకం
- గుండెపోటు, సహజ మరణాలకు ఈ పథకం వర్తించదు.
- ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి వైకల్యం పొందినా రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ. లక్ష నామినీకి అందిస్తారు.

అర్హులు

- 18 నుంచి 70 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలి.
- బ్యాంకు అకౌంట్ ఉన్న వారు సులభంగా ఈ పథకంలో చేరొచ్చు.
- నేరుగా బ్యాంకు వెళ్లి అక్కడి సిబ్బందితో మాట్లాడితే సరిపోతుంది.
- ప్రీమియం కట్ చేసుకుని పాలసీ అందిస్తారు.

అవసరమైన పత్రాలు

- గుర్తింపు కోసం ఆధార్ కార్డు
- సెల్ నెంబరు
- నామినీ వివరాలు
- బ్యాంకు ఖాతా వివరాలు

సాంస్కృతిక కార్యక్రమాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగతాయని అందులో భాగంగా ధూర్జటి కళా ప్రాంగణం, స్వామి అమ్మవార్ల పుర ఉత్సవంలో జరిగే సాంస్కృతి కార్యక్రమాలకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ బాపిరెడ్డి పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను పూర్తి వివరాలతో పాటు ఫొటో, బ్యాంకు పాసుబుక్ జిరాక్సును జత చేసి ఈనెల 20వ తేదీ లోపు ఆలయ కార్యాలయానికి నేరుగా కాని, పోస్టు ద్వారా కానీ అందజేయాలని తెలిపారు.

20 నుంచి పశువైద్య శిబిరాలు

రేణిగుంట (ఏర్పేడు) : పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలంలో ఈనెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 12 రోజుల పాటు పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ శిల్పారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పేడు మండలంలోని అన్ని పంచాయతీల్లో శిబిరాలు నిర్వహించి పశువులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ చేయనున్నట్లు తెలిపారు. అలాగే గొర్రెలు, మేకలకు టీకాలు వేయడంతో పాటు పశువులకు సాధారణ వైద్య సేవలు, కృత్రిమ గర్భధారణ, గర్భకోశ వ్యాధుల చికిత్సలు అందజేయనున్నారు. ఈ పశు వైద్య శిబిరాలకు పాడి రైతులు పశువులను పెద్ద సంఖ్యలో తీసుకొచ్చి వివిధ పశు వైద్య సేవలు పొందాలని కోరారు.

అమ్మవారి ఊరేగింపునకు వీధుల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు, గొబ్బిళ్లు ఆడుతున్న మహిళలు, యువతులు, సర్వమంగళదేవి జాతర ఊరేగింపు





గౌరమ్మా.. దీవించమ్మా

- వేడుకగా గౌరీదేవి ఉత్సవం

సత్యవేడు : పట్టణంలో గిరిజనులు మంగళగౌరి జాతర ఉత్సవాన్ని శుక్ర, శని వారాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు ప్రారంభమైన ఉత్సవం శనివారం ఉదయం 9 గంటల వరకు సాగింది. సంక్రాంతి పండుగ అనంతరం నాలుగు, ఐదు రోజుల్లో గిరిజనులు సర్వ మంగళ గౌరీదేవికి (గొబ్బెమ్మ దేవత)కి పూజలను గిరిజన మహిళలు చేశారు. గౌరీదేవి ఆలయం శుభ్రం చేసి ప్రాంగణంలో రంగ వల్లులతో అలంకరించారు. గౌరి వ్రత పూజకు ఇంటికో మహిళ వంతున హాజరై గొబ్బి పాటలతో , గొబ్బిళ్లు తట్టారు. ఏటా మహిళలు ఆలయం ముందు సమూహంగా పొంగళ్లు పెట్టి గొబ్బి పాటలు పాడటం సంప్రదాయంగా వస్తోంది.

భక్తిశ్రద్ధలతో ఊరేగింపు

శుక్రవారం రాత్రి ప్రారంభమైన సర్వమంగళ గౌరీదేవి ఊరేగింపు గిరిజన కాలనీ, బీసీ కాలనీ, ఆర్టీసీ రోడ్డు, నేతాజీ రోడ్డు అమ్మవారు పురవీధుల్లో భక్తులకు దర్శన మిచ్చారు. ఊరేగింపులో మహిళలు చలిని లెక్క చేయక తెల్లవార్లు గొబ్బిళ్లు ఆడుతూ అమ్మవారి ముందు నడిచారు.

అమ్మవారి నిమజ్జనం

గ్రామంలో ఊరేగింపు అనంతరం గ్రామ పొలిమేర్లలోని జంట కోనేరు వద్ద అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి ముందు పెద్ద ఎత్తున డప్పులు వాయిస్తుండగా పూనకం వచ్చిన భక్తులు అరుస్తూ ఆనంద తాండవం చేశారు.